# దీవెన

'ఎదిగిన ఆడపిల్ల కన్నవాళ్లకు గుండెల మీద కుంపటి' అన్నది ఏనాటి మాటో కాని 'మీసాలొచ్చిన మగరాయుడే తల్లిదండ్రులకు గుండె బరువు' అన్నది నేటి మాట అంటాడు ప్రకాశం. అలా అని ఊరుకున్నా బాగుణ్ణు. 'కొడుకులేం ఉద్ధరిస్తార్లే కంటే కూతుర్నే కను. కాటికెళ్లే ముందు కన్నీరైనా పెడుతుంది' అంటూ ఓ ఉచిత సలహా కూడా పారేస్తుంటాడు.

"ప్రకాశానికి కూతుళ్ళు లేరు. అందుకే ఆడపిల్లలంటే అంత మక్కువ" అంటారంతా. అయినా తన ధోరణి తనదే తప్ప ఎవరేమనుకుంటారోనన్నది పట్టించుకోడు.

"మా చిన్నమ్మాయి, అల్లుడు రేపు వ్రతం చేస్తున్నారు. నువ్వొచ్చి రెండక్షింతలు వెయ్యాలి" అన్నాడు పార్వతీశం.


"తప్పకుండా. రాకపోతే నువ్వూరుకుంటావా?" నవ్వుతూ అన్నాడు ప్రకాశం.

వాళ్ల స్నేహం ఈనాటిది కాదు. వాళ్లు చిన్నప్పుడు క్లాస్‌మేట్స్.

ఆఫీసులో కొలీగ్స్.

ఇప్పుడు కాలనీమేట్స్.

ప్రకాశానికి ఇద్దరూ కొడుకులే అయితే, పార్వతీశానికి ఇద్దరూ కూతుళ్లే. చక్కని చుక్కలు కాకపోయినా చక్కగా చదువుకున్నారు. చదువు అవడంతోనే వాళ్లకి దండిగా డబ్బులు పోసి మంచి సంబంధాలే చూసాడు పార్వతీశం. ఉబుసుపోనప్పుడు కూతుళ్ల కాపురాలు చూసి రావడం మినహా ఇప్పుడు మరో పనేం లేదతగాడికి. వాళ్లు కూడా



ఏదో వంకతో అడపా తడపా పుట్టింటికి వస్తూనే ఉంటారు.

వ్రతం పూర్తి అవుతూ వుండగా వచ్చాడు ప్రకాశం.

"రా....నీ కోసమే ఎదురు చూస్తున్నాను"

ఆప్యాయంగా పలకరించి ప్రకాశాన్ని కూర్చోబెట్టాడు పార్వతీశం.

ప్రసాదం నోట్లో వేసుకుని పీటల మీంచి లేచారు శంకరం దంపతులు.

"ఇలా వచ్చి బాబాయి గార్కి దండం పెట్టండి" మిత్రుడి చేతిలో అక్షింతలుంచుతూ అమ్మాయి, అల్లుణ్ణి పిలిచాడు పార్వతీశం.

పట్టువస్త్రాల్ని పైకెగదోసు కుంటూ ప్రకాశం పాదాల్ని తాకారు శంకరం దంపతులు.

"పుత్రికా ప్రాప్తిరస్తు" దీవించాడు ప్రకాశం. ఆ మాటలకు మొహం ముడుచుకుంది పార్వతి.

"ఇటువంటి వాడికి దణ్ణం పెట్టడం శుద్ధ దండగ" అనుకున్నాడు శంకరం.

వాళ్ల మనోభావాలు ప్రకాశానికి అర్థం కాకపోలేదు అయినా పెదవి విప్పలేదు.

అతగాడి ఆశీర్వాదం పార్వతీశం భార్యకి కూడా నచ్చలేదు.

"ఏమిటండీ ఆ దీవెన....బుద్ధి ఉండఖర్లా......మనకో మనవడు కలిగితే చూడలేడా?" ప్రకాశం గుమ్మం దాటగానే పెనిమిటి మీద విరుచుకుపడింది అలివేలు.

"పోన్లేవే. వాడలా అన్నంతమాత్రాన ఆడపిల్లే పుట్టేస్తుందా?....ఎవరికి ఎవరు ప్రాప్తో' వేదాంతం వొలకబోసాడు పార్వతీశం.

"ఆ మాట ఎవరూ కాదనలేరనుకోండి అయినా ఓర్వలేని గుణం కాకపోతే మరేవిటి? పిల్లాడు తనకే కాని మరెవరికీ మగసంతతి ఉండకూడదనుకున్నాడో ఏమో?" నిష్ఠూరమాడింది అలివేలు.

అర్ధాంగి మాటలకు చివుక్కుమన్నది అతడి అంతరాత్మ.

"ప్రకాశం నా ఆప్తుడు.... వాడెందుకలా దీవించాడో నాకు తప్ప మీకెవ్వరికీ

తెలీదు'' వుండబట్టలేక అన్నాడు పార్వతీశం.

అంతా ఆశ్చర్యంగా చూసారతడి వంక.

.....

సంతానాన్ని పెంచుకుంటూ పోవడమిష్టం లేక ఇద్దరు పిల్లలతోనే సరిపెట్టు కున్నాడు ప్రకాశం. ఇద్దర్లో పెద్దవాడు రాజా ఎంచేతో చదువులో స్థబ్దుగా వుండేవాడు. వాడి ప్రోగ్రెస్ బాగోలేదని ప్రిన్సిపాలు ఫిర్యాదు చేయడంతో ప్రతి క్లాసులో వాడికి ట్యూషన్ పెట్టించాడు ప్రకాశం. అయినా ఫలితం కనిపించలేదు. ఒక్కో సబ్జక్టు కడుతూ ఎలాగో టెన్త్ పూర్తి అయిందనిపించాడు. ఆ తర్వాత ఇహ నాకు చదువు ఒంటబట్టదంటూ ఇంట్లో కూర్చున్నాడు. ఖాళీగా వుండి గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునే బదులు ఏ దుకాణం లోనైనా పనిచేయరాదా అంటే వాడికి బోలెడంత నామోషి. గవర్నమెంటు ఉద్యోగం తప్ప వేరేదీ చేయనంటాడు. ప్రభుత్వోద్యోగాలు మాటలమీద ఉన్నాయా? వయసు మీరుతున్నా కొడుకెందుకు పనికిరాకుండా పోవడంతో దిగులు పట్టుకుంది ప్రకాశానికి. పోతే చిన్నవాడు చిరంజీవి చురుకైనవాడే. అయితే మట్టుకు ఏం లాభం? వాడికి కుదురు లేదు. ఆవేశం ఎక్కువ. ఆలోచన తక్కువ. ముక్కుమీదే వుంటుంది కోపం. పిసరంత మాటవినడు. చదువులో ఎలా వున్నా అల్లరిలో అందరికంటే ముందే వుంటాడు. డబ్బులివ్వందే బడికి పోడు. పుస్తకాలు కొనుక్కోమంటే కొనుక్కు తినేస్తాడు. ఫీజు కట్టమని పైకమిస్తే సినిమాలకు చెక్కేస్తాడు. అదేమిరా అంటే ఇంట్లోంచి పోతానని బెదిరిస్తాడు. బెదిరింపే కాదు అన్నంతపని చేస్తాడు కూడా. అందుకే వాడి విషయంలో రాజీపడడం మినహా వేరే మార్గం లేకపోయింది ప్రకాశం దంపతులకి.

చిరంజీవికి వయసుతో పాటు వ్యసనాలు కూడా అబ్బాయి. డబ్బుకోసం ఇంట్లో చిల్లర దొంగతనాలు మొదలుపెట్టాడు. పెదవి విప్పితే ఎక్కడ పరువు పోతుందోనని నోరు నొక్కుకున్నాడు ప్రకాశం. పాపం అతడి పరిస్థితి చూస్తే ఎవరికైనా జాలి వేస్తుంది.

ఇలా ఉండగా "మా పెద్ద పిల్లకి సంబంధం ఖాయమైంది. వచ్చే గురువారమే పెళ్లి'' అని చెప్పి శుభలేఖ పట్టుకొచ్చాడు పార్వతీశం.

"తొందరగా తాత అయిపోదామనా?'' వెటకారమాడాడు ప్రకాశం.

"మొగపిల్లలు కలవాడివి నీకేం? ఎన్నైనా చెబుతావు'' అన్నాడు పార్వతీశం.

"నాకు నీలాగ ఆడపిల్లలు పుట్టివుంటే బాగుండేదిరా పెళ్ళిళ్ళు చేసేసి బాధ్యతలు తీర్చుకుని వుండేవాణ్ణి''

ప్రకాశం మాటకు జవాబివ్వలేదు పార్వతీశం.

రోజులు దొర్లుతున్నాయి.

ఋతువులు మారుతున్నాయి.

చిరంజీవికి చెడు తిరుగుళ్లు ఎక్కువవడంతో చూస్తూ ఊరుకోలేక కొడుకును గట్టిగా మందలించాడు ప్రకాశం.

తండ్రిమాటకు కోపగించుకుని ఇల్లు విడిచి వెళ్లిపోయాడు చిరంజీవి.

బిడ్డమీద బెంగతో మంచం పట్టింది భ్రమరాంబ. మాటిమాటికి కొడుకును తలచుకుంటూ కుమిలిపోసాగింది. 'బుజ్జివెధవ ఎక్కడుంటున్నాడో ఏం తింటున్నాడో'' అనుకుంటూ వెక్కివెక్కి ఏడ్చేది. ఆ తల్లి కడుపుకోతను చూడలేకపోయేవాడు ప్రకాశం. అయితే తను మట్టుకు ఏం చేయగలడు? పోలీస్ రిపోర్టిచ్చాడు. పేపర్లో వేయించాడు. కన్నతండ్రిగా తనకు మాత్రం కొడుకును చూడాలని వుండదా? తను మగవాడు కాబట్టి దుఃఖాన్ని లోలోపలే దిగమ్రింగుకుంటున్నాడు.

రోజులు గడుస్తున్నకొద్దీ భ్రమరాంబ ఆరోగ్యం క్షీణించసాగింది. మనోవ్యాధికి మందులేదంటారు అందుకేనేమో ఎన్ని మందులు వేసినా గుణం కనిపించడం లేదు. ఉన్నట్లుండి ఓ రోజు హఠాత్తుగా కన్నుమూసింది.

బావురుమన్నాడు ప్రకాశం.

పార్వతీశం వచ్చి మిత్రుణ్ణి ఓదార్చాడు.

ఇంట్లో ఇప్పుడు తను, రాజా తప్ప మరో వ్యక్తి లేదు. వంటపని దగ్గరనుంచి అన్ని పనులు తనే చేస్తున్నాడు ప్రకాశం.

తిని పడుకోవడం రాజా వంతైంది.

"పెళ్లి చేస్తే తప్ప వాడికి బాధ్యత మోయదు" అంటూ సలహాలిచ్చారు స్నేహితులు.

ఆ ఆశతోనే పెళ్లి ప్రయత్నం చేసాడు.

అబ్బాయికి ఉద్యోగం లేదని తెలిసినా, ప్రకాశం ఆస్తిపాస్తుల్ని చూసి పిల్లనివ్వడానికి ముందుకొచ్చాడో పెద్ద మనిషి.

వచ్చిన సంబంధాన్ని వదలుకోలేక సరేనన్నాడు ప్రకాశం.

రాజాకి పెళ్లంటే అయింది కాని, వాడిలో ఆశించిన మార్పు మాత్రం రాలేదు. ఫలితంగా బిడ్డతో పాటు కోడలి మంచి చెడులు కూడా తనే చూడవలసి వస్తోంది.

ఓ రోజు పార్వతీశం వచ్చి 'నాకు మనవడు పుట్టాడ్రా' అంటూ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బై పోతూ గుప్పెడు చాక్లెట్లు తీసి ప్రకాశం చేతిలో గుమ్మరించాడు.

పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినప్పుడే పుట్టదు జనులా పుత్రుని

కనుగొని పొగడు పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ.

సమాధానంగా చిన్నప్పుడు చదివిన పద్యం గుర్తుతెచ్చుకుని చదివాడు ప్రకాశం.

"అంతేలే, నీ జీవితాన్ని చూస్తున్నాను కదా" అన్నాడు పార్వతీశం. ఆ మాట అంటున్నప్పుడు అప్రయత్నంగా అతడి కళ్లనుండి రెండు నీటిబొట్లు జాలువారాయి.

.....

"విన్నారు కదా ప్రకాశం గాధ. ఇప్పుడు చెప్పండి తప్పుపట్టవలసినంత తప్పేమైనా ఉందా వాడి దీవెనలో?" సూటిగా ప్రశ్నించాడు పార్వతీశం.

**( 2, ఫిబ్రవరి 2002 సుప్రభాతం వీక్లీ )**